సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 5 । నవంబర్ । 2024



పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



సద్వినియోగం చేసుకోవాలి

గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /16.3

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయండి'



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. తన నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం స్థలాన్ని సిద్ధంగా ఉంచామని డిప్యూటీ సీఎంతో పేర్కొన్నానని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించిన బిల్లులను మంజూరు చేయాలని కోరానన్నారు.

రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు

మద్నూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని మార్కెట్ కమిటీ అధికారి చందర్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు బీట్‌లు మొదలవుతాయని పేర్కొన్నారు. క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర చెల్లిస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: పీజీ, పాటు పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ విషయమై కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబీఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఫిలాసఫీ, సోషియాలజీ, పీపీఎం, పీఏ, ఉర్దూ, హిందీ, తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్, ఎమ్మెస్సీ మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయో ఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోర్సులలో చేరడానికి ఆసక్తిగలవారు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94403 56276, 91823 04067 నంబర్లలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



దోమకొండ: జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు దోమకొండకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్–17 రికర్వ్ రౌండ్‌లో బాలుర విభాగంలో అనుదీప్, బాలికల విభాగంలో ప్రీతి బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఇండియన్ కేటగిరి బి రౌండ్‌లో ఇందు నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. దీంతో వీరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. వీరు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని నందియార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు

రేపు జిల్లా మత్స్యసహకార సంఘం సమావేశం

కామారెడ్డి అర్బన్: జిల్లా మత్స్యకారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నారు. పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లోగల మున్నూరుకాపు సంఘంలో ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చేప పిల్లల సరఫరా, కొత్త సంఘాల ఏర్పాటు, చేపల మార్కెట్లు, కమ్యూనిటీ గదుల నిర్మాణం, సంచార చేపల వాహనాలు, ప్రమాద బీమా తదితర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోటగిరి(రుద్రూర్): కేజీబీవీ విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జీఈసీవో భాగ్యలక్ష్మి సూచించారు. ఆమె సోమవారం కోటగిరి, రుద్రూర్ కేజీబీవీలను సందర్శించారు. గదులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

కామారెడ్డిపై శీతకన్ను!

- సీఆర్‌ఆర్ నిధుల కేటాయింపులో వివక్ష
- కామారెడ్డి నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లకు రూ.5 కోట్లతో సరి
- జిల్లాలో మిగతా నియోజకవర్గాలకు రూ.15 కోట్లపైనే కేటాయింపు
- తక్కువ నిధులు ఇవ్వడంపై ప్రజల్లో చర్చ

అభివృద్ధిలో అన్ని నియోజకవర్గాలకు సమ ప్రాధాన్యత ఇవ్వాల్సిన సర్కారు.. కామారెడ్డిపై మాత్రం శీతకన్ను వేసింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట ఎక్కువ నిధులు కేటాయించి కామారెడ్డికి మాత్రం తక్కువ నిధులతో సరిపెట్టింది. దీనిపై ప్రజల్లో చర్చ నడుస్తోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్‌ఆర్) పథకం కింద ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలోని 92 గ్రామీణ ప్రాంత అసెంబ్లీ నియోజకవర్గాలలో 1,323.86 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి కోసం రూ.1,377.66 కోట్లు కేటాయించింది. చాలా నియోజకవర్గాలకు రూ.15 కోట్లు ఆపైనే నిధులు మంజూరు కాగా.. కామారెడ్డి నియోజకవర్గానికి రూ.5 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు రూ.15 కోట్ల చొప్పున మంజూరు చేశారు.

ఇద్దరు నేతలు ప్రతిపాదనలు పంపినా..

రాష్ట్రంలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీఆర్‌ఆర్ నిధుల కోసం ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. కామారెడ్డి ఎమ్మెల్యే రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అలాగే నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కూడా రూ.10 కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చారు. ఇద్దరు కలిపి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు ఇస్తే ప్రభుత్వం రూ.5 కోట్లు మాత్రమే మంజూరు చేశారు.



గొడుగుమర్రి తండాకు వెళ్లే దారి

ఇదే సమయంలో జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు రూ.15 కోట్ల చొప్పున కేటాయించడం గమనార్హం. దీనిపై స్థానికంగా చర్చ జరుగుతోంది. కామారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు ఎన్నో ఉన్నాయి. కొన్ని తండాలకు ఇప్పటికీ సరైన రోడ్లు లేవు. అలాంటి మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించకుండా చిన్నచూపు చూడడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు.

రాజకీయాలతో అన్యాయం!

కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. ఇక్కడ విపక్ష ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. అభివృద్ధికి ఎమ్మెల్యే కలిసిరావడం లేదని, పైగా జరిగిన పనులపై ఫిర్యాదులు చేస్తూ అధికారులను ఇబ్బంది పెడుతున్నారని, దీంతో ఇక్కడ పనిచేయడానికి అధికారులు భయపడుతున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అధికారంలో ఎవరు ఉన్నా సరే అధికారులు ప్రొటోకాల్ ప్రకారం నడచుకోవాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొంటున్నారు. అధికార, విపక్ష పార్టీల రాజకీయాలతో అభివృద్ధికి కావలసిన నిధుల కేటాయింపులో అన్యాయం జరుగుతోందన్న భావన ప్రజల్లో ఏర్పడుతోంది.

అభివృద్ధికి నిధుల గ్రహణం

మూడు, నాలుగు జిల్లాల కూడలి అయిన కామారెడ్డి పట్టణం నలువైపులా విస్తరించినా అభివృద్ధిలో మాత్రం వెనకే ఉంది. జిల్లా కేంద్రంలో రోడ్ల వెడల్పు అంశం దశాబ్దాలుగా రాజకీయాల చుట్టూ తిరుగుతోంది. స్టేషన్‌రోడ్డు, సిరిసిల్ల రోడ్డులో రద్దీ విపరీతంగా పెరిగింది. డివైడర్లు నిర్మించినా, రోడ్డు వెడల్పు చేయకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. జన్మభూమిరోడ్డు నుంచి కొత్త బస్టాండ్, అశోక్‌నగర్ మీదుగా అడ్లూర్ రోడ్డు, పాతబస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ కూడా మూలకు చేరింది. నిజాంసాగర్ చౌరస్తా, అశోక్‌నగర్ చౌరస్తా, ఇందిరాచౌక్, రామారెడ్డి చౌరస్తా తదితర కూడళ్లను అభివృద్ధి చేయడానికి అప్పట్లో ప్రణాళికలు రూపొందించినా.. అవేవీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. పట్టణాన్ని రెండుగా చీల్చే రైల్వే లైన్‌పై ప్రస్తుతం ఉన్న వంతెన వెడల్పు, అశోక్‌నగర్‌లో మరో వంతెన నిర్మాణం, అండర్‌పాస్‌ల నిర్మాణాల ఊసే లేదు. బల్దియా అప్పుల్లో కూరుకుపోవడంతో అభివృద్ధి అటకెక్కింది. ఈ నేపథ్యంలో కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కీలక నేతలు విభేదాలను పక్కన పెట్టాలని, ఎన్ని నిధులు సాధించామన్న దానిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ డిప్యుటేషన్లపై కలెక్టర్ సీరియస్!

- ఎవరిని ఎక్కడికి పంపారో వివరాలివ్వాలని ఆదేశం
- అదనపు కలెక్టర్‌కు విచారణ బాధ్యతలు
- పూర్తి నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకునే అవకాశం


విద్యాశాఖలో అక్రమాలు

'సాక్షి'లో ప్రచురితమైన కథనం క్లిప్పింగ్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్ అయ్యారు. 'విద్యాశాఖలో అక్రమాలు' శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. జిల్లాలో ఏ పాఠశాల నుంచి ఏ ఉపాధ్యాయుడిని ఏ పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపారు? కారణాలేమిటి? పాటించిన విధానాలు ఏమిటి? అన్నదానిపై పూర్తి వివరాలు ఇవ్వాలని డీఈవో రాజును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఆయా మండలాల నుంచి డిప్యుటేషన్‌పై పంపిన ఉపాధ్యాయుల వివరాలను సేకరించారు. సాయంత్రానికి తిరిగి కలెక్టర్‌ను కలిసి జిల్లాలో జరిగిన డిప్యుటేషన్ల వివరాలను అందించినట్లు సమాచారం. కాగా డీఈవో ఇచ్చిన జాబితా, డిప్యుటేషన్లకు గల కారణాలపై విచారణ జరపాలని అదనపు కలెక్టర్ విక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలుంటాయని భావిస్తున్నారు. అయితే విచారణను పక్కదారి పట్టించేందుకు విద్యాశాఖ అధికారుల తరఫున కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మండల అధికారులకూ వాటా!

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ల వ్యవహారంలో కొందరు మండల విద్యాశాఖ అధికారుల పాత్ర ఉందని స్పష్టమవుతోంది. దూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులను కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల స్కూళ్లకు తీసుకురావడంలో ఓ ఎంఈవో కీలకంగా పనిచేశారని ఉపాధ్యాయులు బాహాటంగా చెబుతున్నారు. మొన్నటివరకు ఒక్కో ఎంఈవో నాలుగైదు మండలాలకు ఇన్‌చార్జీగా వ్యవహరించారు. ఓ ఎంఈవో అయితే తాను ఎమ్మెల్యేతో సమానమని, విద్యాశాఖలో తాను చెప్పిందే వేదమని పేర్కొంటూ అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో విద్యాశాఖను గాడిలో పెట్టడానికి ప్రయత్నిస్తున్న కలెక్టర్.. ఇలాంటి అక్రమ వ్యవహారాలపై ఉక్కుపాదం మోపాలని విద్యాభిమానులు కోరుతున్నారు.

'సాక్షి' కథనంపై చర్చ

జిల్లాలో అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారంపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ వాట్సాప్ గ్రూప్‌లలో ఈ కథనం క్లిప్పింగ్ చక్కర్లు కొట్టింది. ఉపాధ్యాయుల డిప్యుటేషన్ల వ్యవహారంలో డబ్బులు చేతులు మారిన విషయంపై అంతటా చర్చ నడుస్తోంది. మారుమూల గ్రామాల్లో విద్యార్థులు ఎక్కువగా ఉన్నప్పటికీ టీచర్లను డిప్యుటేషన్‌పై పంపడంలో ఉన్న మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ రాష్ట్ర చైర్మన్‌గా నర్సింగరావు

మాచారెడ్డి: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్‌గా మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్ నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం ఇచ్చిన విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న నర్సింగ రావు

'విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి'



విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

కామారెడ్డి రూరల్: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు సూచించారు. సోమవారం టేక్రియల్‌లో విద్యుత్ అధికారులు పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని, స్టార్టర్ బాక్సులను ఇనుపవి కాకుండా ప్లాస్టిక్‌వి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సమస్యలుంటే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎస్ఈ రమేశ్‌బాబు, డీఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏఈ శ్రీనివాస్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ నవీన్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజాగౌడ్, లైన్ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, లైన్‌మెన్ బాబు, రవి, అసిస్టెంట్ లైన్‌మెన్ ప్రశాంత్ రెడ్డి, వెంకటేష్, రాజశేఖర్, భరత్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రత్యేకాధికారిగా శరత్



సుభాష్‌నగర్ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారి శరత్‌ను ప్రత్యేకాధికారిగా నియమించింది. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి కొనుగోళ్లను పర్యవేక్షించనున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 423 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్‌లు, టార్పాలిన్‌లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. సన్నరకం వడ్లు, దొడ్డురకం వడ్లను వేరువేరుగా కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన లారీల్లో ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలన్నారు. సీఎంఆర్ సక్రమంగా చేపట్టని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఇన్‌చార్జి డీఎస్‌వో నరసింహారావు, డీఆర్‌డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, సహకార అధికారి రామ్మోహన్, మార్కెటింగ్ అధికారి రమ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

తూకాలను వేగవంతం చేయాలి



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి రూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సోమవారం ఆయన గర్గుల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడానికి అదనంగా హమాలీలను నియమించుకోవాలన్నారు. తూకం వేసిన బస్తాలను ఎప్పటికప్పుడు లారీల్లో నింపి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్దన్, సీఈవో మోహన్‌రావు, సిబ్బంది సతీష్, ఆనంద్, కాంట్రాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'టూ టౌన్' ఏర్పాటయ్యేదెప్పుడో?

- విస్తరిస్తున్న జిల్లా కేంద్రం.. అయినా ఒక్కటే ఠాణా
- పెరుగుతున్న కేసులు, ట్రాఫిక్ సమస్యలు
- పనిభారంతో ఇబ్బందిపడుతున్న పోలీసులు
- ప్రతిపాదనలకే పరిమితమైన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
- మహిళా పీఎస్ కూడా అవసరమే..

కామారెడ్డి క్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస శాఖదే ప్రధాన పాత్ర. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న జనాభా, కేసుల సంఖ్యకు అనుగుణంగా పరిపాలనా విభాగంలో కూడా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంటుంది. కామారెడ్డి జిల్లాగా ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచాయి. పట్టణం పెరిగినా ఇప్పటికీ ఒకేఒక్క పోలీస్ స్టేషన్‌తోనే నడిపిస్తున్నారు.

జిల్లాలో 3 సబ్ డివిజన్‌లు, 6 సర్కిళ్లు, 23 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఇంకా ఠాణాలు ఏర్పాటు చేయలేదు. పోలీసు విధులకు సంబంధించి జిల్లా కేంద్రంలోనే సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా అయిన తర్వాత కామారెడ్డి రూపురేఖలు మారాయి. మున్సిపాలిటీలో శివారు గ్రామాలను విలీనం చేశారు. అవసరాల నిమిత్తం ప్రజల రాకపోకలు పెరిగాయి. జిల్లాకేంద్రంలో సహజంగానే ఇక్కడ బందోబస్తు విధులు, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం పట్టణ ఠాణాలో ఎస్‌హెచ్‌వోగా సీఐ స్థాయి అధికారి, ఐదుగురు ఎస్సైలు, ఇతర అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు. పట్టణ విస్తీర్ణం పెరగడంతో పనిభారం పెరుగుతుండడంతో ఇటీవల టూ టౌన్ ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. సరిగ్గా పట్టణం మధ్యలో నుంచి రైల్వే లైన్ ఉంది. పట్టాలకు మరో వైపు ప్రాంతానికి టూ టౌన్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో మహిళలకు సంబంధించిన కేసులు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. పట్టణ పోలీస్ స్టేషన్ ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటోంది. దీంతో ఆయా అవసరాలు, సమస్యలపై పీఎస్‌కు వచ్చే మహిళలకు అక్కడి వాతావరణం ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్ ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టూ టౌన్‌తో పాటు, ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటయితే పోలీసులపై పనిభారం తగ్గే అవకాశాలున్నాయి.



పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్

ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు

పట్టణ జనాభా 1.15 లక్షలు దాటింది. కేసుల సంఖ్య, ట్రాఫిక్ ఇబ్బందులు కూడా పెరుగుతూనే ఉన్నాయి. అయినా కూడా డివిజన్‌గా ఉన్నప్పటిలాగానే ఇప్పటికీ జిల్లా కేంద్రాన్ని ఒకే ఒక్క పోలీస్ స్టేషన్‌తో నెట్టుకు వస్తున్నారు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. కేసులకు తోడు కొంతకాలంగా బందోబస్తులు పెరిగాయి. ఆయా కారణాలతో కనీసం సెలవులు దొరకడం లేదని, కుటుంబాలతో గడపలేకపోతున్నామని పలువురు పోలీసులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డిలో ప్రత్యేకంగా ఓ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని గుర్తించిన జిల్లా అధికారులు ఐదేళ్ల క్రితమే రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదించారు. దీంతో పాటు రూరల్ పీఎస్‌గా ఉన్న దేవునిపల్లి ఠాణాను అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ ప్రతిపాదనలు సైతం పంపారు. అయితే ట్రాఫిక్ పీఎస్ ఏర్పాటు ప్రతిపాదనల దశ దాటడం లేదు.

రూరల్‌లోనూ అదే సమస్య..

కామారెడ్డి మండలంలోని గ్రామాలతో పాటు పట్టణంలోని శివారు ప్రాంతాలను కలిపి దేవునిపల్లి ఠాణా ఉంది. పట్టణ శివారు ప్రాంతంలో కాలనీలు, జనాభా రోజురోజుకు పెరుగుతూ ఉండడం, కలెక్టరేట్ బందోబస్తు తదితర కారణాలతో దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌పై కూడా పని భారం ఎక్కువగానే ఉంటోంది. ఇక్కడ ప్రస్తుతం ఎస్సై స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా ఉన్నారు. ఈ ఠాణాకు సీఐ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ సిబ్బంది, సౌకర్యాలను అదనంగా కేటాయించి అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

రూ.2 లక్షల విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిర అభివృద్ధికి సోమవారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దీకొండ రాంచంద్రం రూ. 2 లక్షల విరాళం అందజేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజుకు ఆయన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. మాజీ సర్పంచ్ దీకొండ శారద, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్, సంఘం ప్రతినిధులు చింతల అంజయ్య, అందె గణేష్, దీకొండ రాజశేఖర్ ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



బాన్సువాడ: పట్టణానికి చెందిన కానిస్టేబుల్ సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన 2002 సివిల్ బ్యాచ్‌కు చెందిన మెన్, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్స్ రూ.90 వేలు సేకరించి సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. తోటి మిత్రుడిని కోల్పోవడం బాధగా ఉందని, తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. సురేష్ అందరితో కలుపుగోలుగా ఉండేవాడని వారు గుర్తు చేసుకున్నారు.

మొదటి మ్యాచ్‌లో నిజామాబాద్ గెలుపు

నిజామాబాద్ నాగారం: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జరుగుతున్న అండర్–23 టోర్నమెంట్‌లో నిజామాబాద్ జట్టు మొదటి మ్యాచ్‌లో కరీంనగర్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచిన కరీంనగర్ జట్టు మొదట 39.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జిల్లా జట్టు 30 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. జస్రిత్‌రెడ్డి 56, హర్షవర్ధన్ 41 పరుగులతో రాణించారు. క్రీడాకారులను క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి అభినందించారు. జిల్లా జట్టు మంగళవారం మెదక్ జట్టుతో తలపడనుంది.

స.హ. చట్టానికి తూట్లు

నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అధికారులు సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. సమాచారం అడిగిన వ్యక్తిని రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో అద్దె వాహనాలు ఎన్ని ఉన్నాయి, వాటి వివరాలను తెలపాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సమీర్ హైమద్ ఆర్‌టీఐ కింద 2022లో దరఖాస్తు చేశారు. ఎన్నిసార్లు కార్యాలయానికి వెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా 2024 మేలో తప్పుడు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై డీఎంహెచ్‌వో రాజశ్రీని వివరణ కోరగా ఆర్‌టీఐకి సంబంధించిన ఫైల్ తన దగ్గరకు రాలేదన్నారు. దరఖాస్తుదారుడు తనకు వాట్సాప్ పెట్టారని, పరిశీలిస్తానని చెప్పారు.

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 67 ఫిర్యాదులు



దివ్యాంగురాలి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. తమ పరిధిలో పరిష్కారాలు లేకుంటే ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోసం చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు

తనను మోసం చేసి తన తమ్ముడు లక్ష్మీనర్సయ్య భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని మాచారెడ్డికి చెందిన ఎర్రోల్ల రాజవ్వ అనే దివ్యాంగురాలు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆమె దివ్యాంగురాలు కావడంతో కలెక్టర్ సంగ్వాన్ స్టేజిపై నుంచి దిగి వచ్చి ఆమె ఫిర్యాదును స్వీకరించారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సర్వే నెంబర్–50లో తన భర్త పేరిట 3.11 ఎకరాల భూమి ఉండగా లక్ష్మీ నర్సయ్య అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని అన్యాయం చేశాడని రాజవ్వ తెలిపారు. న్యాయం చేయాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. తగిన చర్యలకు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారని చెప్పారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఏవో నర్సింలు, ఏపీఎం మనోహర్, ఎంపీవో సవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న వ్యాపారులు

నిజాంసాగర్ (జుక్కల్): హైదరాబాద్– బోధన్ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న తమకు ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం బాన్సువాడ పట్టణంలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి బాధితులు వినతిపత్రం అందజేశారు. మహమ్మద్‌నగర్ మండల కేంద్రంతో పాటు బూర్గుల్ శివారులో రహదారి విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న తమకు ఎకరానికి రూ.30 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. హైవే అధికారులు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిహారం గిట్టుబాటయ్యేలా చూస్తానని ఆమె చెప్పారు. మహమ్మద్ నగర్ వ్యాపారస్తులు జక్సాని శ్రీనివాస్ గుప్తా, రాము, దుబ్బ నాగరాజు గుప్తా, ఎలగందుల ప్రవీణ్, చింతల సంతోష్, తదితరులున్నారు.

తేమ, తూకం యంత్రాల్లో తేడాలపై ఆగ్రహం



విండో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

భిక్కనూరు: కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న తేమను కొలిచే యంత్రం, తూకం యంత్రంలో తేడాలు ఉన్నాయని, అవి తప్పు చూపిస్తున్నాయంటూ మండలంలోని అంతంపల్లి సింగిల్ విండో వద్ద రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యాన్ని ఆరబోసినప్పటికి రెండు నుంచి ఐదు శాతం వరకు తేమను ఎక్కువ చూపిస్తున్నాయని దీని వల్ల రైతులు మరింతగా ఎండబెట్టవలసి వస్తుందని సోమవారం రైతులు వాపోయారు. అలాగే తూకం యంత్రంలో కూడా 20 కిలోలకు వంద గ్రాముల తక్కువ చూపిస్తుందని దీని వల్ల రైతుకు నష్టం వాటిల్లుతుందంటూ రైతులు సింగిల్‌విండో వద్దకు వచ్చి నిరసన తెలిపారు. విండో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయ అధికారులు హుటాహుటిన వచ్చి రైతులతో మాట్లాడారు. తేమ యంత్రం సరిగా పనిచేయడం లేదని గుర్తించి కొత్త తేమ యంత్రాన్ని అందజేశారు. అలాగే తూకం యంత్రంలో వంద గ్రాముల కంటే ఎక్కువ ధాన్యాన్ని పోయవద్దని అధికారులు విండో సిబ్బందికి సూచించారు. తూకంలో మోసం జరుగకుండా చూడాలని రైతులు అధికారులను కోరారు. అనంతరం రైతులు శాంతించి ఆందోళనను విరమించారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



బిచ్కుందలో కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ సురేష్ పరిశీలించారు. ఎంత వరకు కాంటాలు వేశారు..ఎన్ని బస్తాలు రైస్ మిల్లుకు తరలించారని సొసైటీ కార్యదర్శి శ్రావణ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేస్తున్నారు.. సన్నరకం కొనుగోలు ప్రారంభించడం లేదు.. చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు తహసీల్దర్ ముందు వాపోయారు. ప్రతి గింజా కొనుగోలు చేస్తామని, ఆందోళన చెందవద్దని తహసీల్దార్ రైతులకు భరోసా కల్పించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి



దోమకొండలో మాట్లాడుతున్న మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇలియాస్, ఇతర ప్రజాప్రతినిధులు

దోమకొండ/భిక్కనూరు/బీబీపేట: గ్రంథాలయాల్లో చదువుకుని యువత ఉన్నత ఉద్యోగాలు సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం దోమకొండ, భిక్కనూరు, బీబీపేట మండలాల పరిధిలోని గ్రంథాలయాలను కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ తదితరులతో కలిసి సందర్శించారు. గ్రంథాలయాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలు లేవని, టాయిలెట్లు మరమ్మతులు చేయించాలని పాఠకులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాయలంలో కొత్త సిలబస్ పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరారు. స్పందించిన ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

ప్రతి గ్రంథాలయానికి ఇంటర్నెట్: ఇలియాస్

సొంత నిధులతో కామారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రంథాలయానికి ఇంటర్నెట్ కనెక్షన్‌తో పాటు వైఫై సౌకర్యం ఏర్పాటు చేస్తానని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, పాఠకులకు హామీ ఇచ్చారు. రాజకీయాలకతీతంగా రిటైర్డ్ ఉద్యోగులు, రచయితలు, మేధావులు గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రతి గ్రంథాలయంలో మరుగుదొడ్లతో పాటు మౌలిక వసతులు వెంటనే షబ్బీర్ అలీ ఫౌండేషన్ ద్వారా సమకూర్చుతామన్నారు.

గ్రంథాలయానికి తన వంతు విరాళంగా పుస్తకాల కోసం రూ.15 వేలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రంథాలయంలో పుస్తకాల కోసం పలువురు దాతలు వెంటనే స్పందించి విరాళాలు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ రూ.15 వేలు, సీడీసీ మాజీ చైర్మన్ ఐరేని నర్సయ్య రూ.10 వేలు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి రూ.10వేలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్ రూ.10 వేల చొప్పున విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, భిక్కనూరు మండల అధ్యక్షుడు భూం రెడ్డి, భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, చాముండేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధారెడ్డి, కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యదర్శి అబ్రబోయిన స్వామి, తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు నిరుపేదలకు రేషన్ సరుకులు సకాలంలో అందించి వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచులు



లింగంపేటలో..



ఎల్లారెడ్డిలో..

రామారెడ్డి/లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి వెళ్తున్న మాజీ సర్పంచులను జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు పోలీస్‌స్టేషన్లలో మాట్లాడారు. తాము గ్రామాల అభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బులు అడగడానికి బయలుదేరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. ఆస్తులు తాకట్టు పెట్టి పనులు చేయిస్తే డబ్బులు ఇవ్వరా అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు అధ్వానంగా మారాయని ఆరోపించారు. సమస్యలు చెప్పుకోవడానికి హైదరాబాద్‌కు వెళ్లకుండా అర్ధరాత్రి అరెస్టు చేసి నిర్బంధించడం దుర్మార్గమన్నారు. బిల్లులు ఇవ్వని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

సంక్షిప్తం

తరుగు లేకుండా కొనుగోలు చేయాలి

భిక్కనూరు: వరిధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్ మద్ది స్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బస్వాపూర్‌లో మాట్లాడుతూ..తరుగు లేకుండా రైస్‌మిల్లర్లు ధాన్యం తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కాంటా అయిన 24 గంటల్లో బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. సీఈవో మహేశ్వరి, డైరెక్టర్లు కిష్టారెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, రాజనర్సింహరెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ, తుంకిపల్లి గ్రామాల్లో సోమవారం గున్కుల్ సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, గోర్గంటి రాములు, గొల్ల గోపాల్, తదితరులున్నారు.

నేడు తపస్ ఆధ్వర్యంలో ధర్నా

బాన్సువాడ రూరల్: పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలో మంగళవారం తపస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవరెడ్డి, సంతోష్‌లు తెలిపారు. ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విత్తనాభివృద్ధి సంస్థకు పూర్వ వైభవం తెస్తాం



నిజామాబాద్ అర్బన్: తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థకు పూర్వ వైభవం చేకూర్చేందుకు కృషి చేస్తామని, అందుకు అన్ని వర్గాల వారు తోడ్పాటు అందించాలని ఆ సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘాల చైర్మన్లు, సీఈవోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి సీజన్‌లో విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులకు ఆయా పంటల సాగుకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు అధిక దిగుబడులు సాధించేలా నాణ్యమైన విత్తనాలు అందించాలనే లక్ష్యంతో 1976లో ప్రభుత్వం విత్తనాభివృద్ధి సంస్థను నెలకొల్పిందని గుర్తు చేశారు. అయితే గత ప్రభుత్వ నిర్లిప్త ధోరణితో గడిచిన పదేళ్ల కాలంలో విత్తనాభివృద్ధి సంస్థ తన ప్రభావాన్ని కోల్పోయిందన్నారు. ప్రైవేట్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయని, నకిలీ, నాసిరకం విత్తనాలతో అనేక చోట్ల రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మేలు చేకూర్చేందుకు సహకార సంఘాల ద్వారా విత్తనాభివృద్ధి సంస్థకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని నిర్ణయించామన్నారు. సంస్థ ద్వారా మేలు రకం విత్తనాలను ఉత్పత్తి చేసి, సకాలంలో రైతులకు అందించడానికి అధికారులు సహకరించాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, సహకార శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నవీపేట: నవీపేటలో రాంపూర్ రోడ్డు క్రాసింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన వాగ్రి సురేశ్(46) తన భార్య సీతతో కలిసి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ సురేశ్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో లలిత అపార్ట్‌మెంట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మోకన్‌పల్లి శివారులో వృద్ధురాలు..

నవీపేట: నవీపేట మండలం మోకన్‌పల్లి శివారులో సోమవారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. వివరాలు.. గత నెల 26న గ్రామానికి చెందిన టేకు ముత్తెమ్మ (85) కాలకృత్యాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు గంగారాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సోమవారం గ్రామ శివారులో ఆమె మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు.

ఖతర్‌లో ముప్కాల్‌వాసి..



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన తాడురి లింబాద్రి(58) గుండెపోటుతో ఖతర్‌లో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింబాద్రి గురువారం డ్యూటీలో ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మృతదేహం త్వరగా ఇంటికి వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. తొమ్మిది మందిని పట్టుకొని, వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బంగారం ఇవ్వకుండా తప్పించుకోడానికి హత్య



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సదాశివనగర్: అప్పుగా తీసుకున్న బంగారం తిరిగి ఇవ్వకుండా తప్పించుకోవడానికి హత్య చేశాడో ఓ వ్యక్తి. సదాశివనగర్ మండలం లింగంపల్లి శివారులో గత నెల 30న రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం వెల్లడించారు. లింగంపేట మండలం కోర్పోల్‌కు చెందిన గంగాధర్ గతంలో బతుకుదెరువు కోసం జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో కొన్ని రోజులు ఉన్నాడు. ఆ సమయంలో డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన కృష్ణతో పరిచయం ఏర్పడింది. 2019లో గంగాధర్ అర్గుల్ నుంచి వచ్చి దుబాయి వెళ్లాడు. దుబాయి నుంచి వచ్చిన గంగాధర్ స్వగ్రామంలో ఇల్లు కట్టుకొని బతుకుతున్నాడు. ఈ క్రమంలో మళ్లీ దుబాయి వెళ్లాలని అనుకున్నాడు. దీనికోసం కృష్ణ భార్య లావణ్య దగ్గర నాలుగు తులాల బంగారం అప్పుగా తీసుకున్నాడు. తిరిగి వచ్చాక నాలుగు తులాలకు ఆరు తులాల బంగారం ఇస్తానని వారికి చెప్పాడు. అయితే గంగాధర్ దుబాయి వెళ్లకుండా డబ్బు ఖర్చు చేశాడు. అప్పుగా తీసుకున్న బంగారం ఇవ్వకుండా తప్పించుకోవడానికి కృష్ణ, లావణ్య దంపతులను చంపాలని ప్లాన్ వేశాడు. గత నెల 30న కృష్ణను కామారెడ్డికి రప్పించాడు. ఇద్దరు కలిసి నిజాంసాగర్ చౌరస్తాలో కల్లు తాగారు. అనంతరం తాడ్వాయి మీదుగా లింగంపల్లి శివారు ప్రాంతానికి వెళ్లారు. లింగంపల్లి శివారులో డంపింగ్ యార్డు వద్ద కృష్ణ మూత్రం పోస్తుండగా తలపై బండరాయితో గంగాధర్ కొట్టాడు. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు కృష్ణ ఫోన్, ఏటీఎం కార్డులను తీసుకొని పరారయ్యాడు. కృష్ణ అకౌంట్ నుంచి రూ.40వేలు విత్‌డ్రా చేశాడు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసు ఛేదించిన సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్, సిబ్బంది రవి, శ్రీనివాస్, వెంకట్, రాములు, యాదగిరిలను ఎస్పీ సింధుశర్మ అభినందించారు. సమావేశంలో ఏఎస్సైలు నర్సయ్య, సాగర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డా కూలీ దారుణ హత్య



చిన్నస్వామి (ఫైల్)

ఎడపల్లి: ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన కొమిరె చిన్న స్వామి(40) దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిన్నస్వామి రెండేళ్లుగా నిజామాబాద్‌లో ఉంటూ అడ్డా కూలీగా జీవనం సాగిస్తున్నారు. పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి శనివారం వెళ్లిన చిన్నస్వామి సోమవారం మెదక్ జిల్లా శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శవమై కనిపించాడు. ఆయన మరో అడ్డా కూలీతో కలిసి వెళ్లాడు. చిన్నస్వామిని హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చిన ఆనవాళ్లు ఉన్నాయి. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

రెండిళ్లలో చోరీ



మాచారెడ్డి: పాల్వంచ మండలం మంతన్‌దేవునిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చాట్ల రాజు ఇంటికి తాళం వేసి మాచారెడ్డి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.40 వేల నగదు, నాలుగు తులాల వెండి పట్టగొలుసులు చోరీ అయినట్లు గుర్తించాడు. అదే గ్రామానికి చెందిన నెత్తట్ల సత్తయ్య ఇంట్లో సైతం దొంగలు రూ.5 వేలు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మాక్లూర్: కుటుంబంలో తరుచూ జరుగుతున్న గొడవలతో మనస్తాపం చెంది మండలంలోని ముల్లంగి (బి) గ్రామానికి చెందిన గంగమణి (52) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. గంగమణి కుమారుడు, కోడలు మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన గంగమణి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. మృతురాలి భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

రామారెడ్డి: బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, వరుడిపై అధికారులు పోక్సో కేసు నమోదు చేశారు. రామారెడ్డిలో గత నెల 16న బాల్య వివాహం జరిగింది. దీంతో అధికారులు సదరు బాలికను రెస్క్యూ హోంకు తరలించి విచారణ చేశారు. అనంతరం రామారెడ్డి కార్యదర్శి ఫిర్యాదు మేరకు బాల్య వివాహం జరిపిన తల్లిదండ్రులు, వివాహం చేసుకున్న శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.